

'మహబూబాబాద్‌లో ఈ రోడ్‌షోను చూస్తుంటే నేల ఈనిందా అన్నట్టుగా ఉంది. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి క్షణం ప్రజల కోసం, ప్రగతి కోసం పనిచేస్తుంది. ఈ విషయాన్ని గుర్తుంచుకొని బీఆర్‌ఎస్‌ను ఆదరించి కారు గుర్తుపై ఓటు వేసి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి'

-మహబూబాబాద్ రోడ్‌షోలో కేసీఆర్



మహబూబాబాద్‌లో కేసీఆర్ రోడ్‌షోకు తరలివచ్చిన అశేష జనవాహిని

- ఈ జిల్లాను రేవంత్‌రెడ్డి రద్దు చేస్తా అంటున్నడు
- సీఎం మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేయాలి
- మాయమాటల కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలె
- మానుకోట రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

## మానుకోట జిల్లా ఉండాలంటే

# మాలోత్ కవిత గెలువాలె



మహబూబాబాద్ రోడ్‌షోలో జైకొడుతున్న కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి మాలోత్ కవిత

మహబూబాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి మహబూబాబాద్ జిల్లాను రద్దు చేస్తా అంటున్నడు.. మీ జిల్లా ఉండాలా? పోవాలా? ఉండాలంటే మాలోత్ కవితను గెలిపించుకోవాలి' అని బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహబూబాబాద్ జిల్లా ఉండాలన్నా, జిల్లాను రద్దు చేస్తా అన్న సీఎం రేవంత్‌రెడ్డి మెడలు వంచాలన్నా ఇక్కడ మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ ప్రాంతం పోరాటాల ఖిల్లా అని, ఆ విషయాన్ని గుర్తించే తాను మహబూబాబాద్‌ను జిల్లా చేశానని, ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు రద్దు చేస్తామని అంటున్నారని తెలిపారు. 40ఏళ్ల చరిత్రలో ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా నీళ్లు తెచ్చి వెన్నవరం ద్వారా మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాల్లోని చివరి ఆయకట్టు వరకు కాళేశ్వరం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చిందని అన్నారు. 'ఇప్పుడు మీకు నీళ్లు వస్తున్నాయా? మీకు రైతుబంధు వచ్చిందా? మీకు తులం బంగారం ఇచ్చారా?' అంటూ కేసీఆర్ ప్రజలను అడుగగా, రాలేదు.. రాలేదు అంటూ సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటి ఇచ్చి ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని, ఒక పథకం అమలు చేసే ముందు మంచీ చెడు ఆలోచించాలని, ప్రజలకు పథకాలు ఇచ్చేప్పుడు ఇంకో వర్గాన్ని దెబ్బతీసేలా ఉండొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు ఉంటున్నదా? బోర్లలో నీళ్లు ఉన్నయా? వడ్లకు బోనస్ ఇచ్చారా? మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామని ఇచ్చారా? ఏదీ అమలుకాలేదన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తే పథకాలు ఇయ్యకున్నా ఏమీ కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, పథకాలు కావాలన్నా.. జిల్లా మీకు ఉండాలన్నా మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఖమ్మం, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట ప్రాంతాల్లో తాగునీటికి బదులు మురికినీళ్లు వస్తున్నాయని, నాలుగైదు నెలల్లోనే మిషన్ భగీరథ నీళ్లు ఎటుపోయాయని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని, గిరిజనుల కోసం బంజారా భవన్ కట్టించామని, పది శాతం రిజర్వేషన్ పెంచామని, తండాలను గ్రామపంచాయతీలు చేశామని, ఇన్ని చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరగదని, జరగనీయనని స్పష్టంచేశారు. మాలోత్ కవిత బ్రహ్మాండంగా పనిచేస్తుందని, మచ్చలేని నాయకురాలు, పోయినసారి అవకాశం ఇస్తే ఐదేళ్లు నిస్వార్థంతో సేవ చేసిందని, మరోసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు, ప్రజలు సీఎం.. సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్ షోలో బీఆర్‌ఎస్ ఎంపీ మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రేగా కాంతారావు, హరిప్రియానాయక్, ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కవితను భారీ మెజార్టీతో గెలిపించాలి

### ముఖ్య నాయకుల సమావేశంలో కేసీఆర్



మాలోత్ కవిత నివాసంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో సమావేశమైన అధినేత కేసీఆర్

మహబూబాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : మానుకోట అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు. బుధవారం రాత్రి ఎంపీ మాలోత్ కవిత నివాసంలో మానుకోట లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మన సర్వేలో కవితకు భారీ మెజార్టీతో గెలుస్తుందని వచ్చిందని, మరింత కష్టపడితే కవిత గెలుపు నల్లేరుమీద నడకేనని చెప్పారు. కవిత విజయం కోసం అందరూ సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు సమావేశంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సిరికొండ మధుసూదనాచారి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రేగా కాంతారావు, బానోత్ హరిప్రియానాయక్, జడ్పీ చైర్‌పర్సన్లు అంగోత్ బిందు, బడే నాగజ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లిలో కేసీఆర్‌కు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న జనం

# జయహో జననేత

- ఉప్పొంగిన అభిమానంతో కేసీఆర్ బస్సుయాత్రకు ఎదురేగిన జనం
- పూలు, గులాబీరంగు కాగితాలు చల్లుతూ స్వాగతించిన అభిమానులు
- 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్' అంటూ బస్సు వెంట హోరెత్తిన నినాదాలు
- కేసీఆర్‌కు హారతులు పట్టి అభిమానాన్ని చాటుకున్న మహిళలు
- కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా మహబూబాబాద్ చేరిన యాత్ర

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండ్రోజులపాటు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర, రోడ్ షో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సూపర్ సక్సెస్ అయ్యింది. మంగళవారం రాత్రి కొత్తగూడెంలో రోడ్ షో ముగిసిన తర్వాత అక్కడే బస చేసిన కేసీఆర్.. బుధవారం సాయంత్రం కొత్తగూడెం నుంచి మహబూబాబాద్ జిల్లాకు బస్సు యాత్ర ద్వారా బయలుదేరారు. యాత్ర షురువైనప్పటి నుంచి తమ ప్రాంతానికి అభిమాన నాయకుడు ఎప్పుడొస్తారా.. అని ఎదురుచూసిన ప్రజలు కేసీఆర్‌కు ఎదురేగి బ్రహ్మరథం పట్టారు. గులాబీ జెండాలు ఊపుతూ.. రంగు కాగితాలు, పూలు చల్లూతూ సంబురం చేశారు. కేసీఆర్‌కు మహిళలు మంగళహారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. ప్రతిగా కేసీఆర్ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జన నీరాజనాల మధ్య కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి బొమ్మనపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గంధంపల్లి, కొత్తపేట, బయ్యారం మీదుగా కేసీఆర్ బస్సు యాత్ర మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరింది.



టేకులపల్లిలో స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మహిళలు



భద్రాద్రి కొత్తగూడెం, మే 1 (నమస్తే తెలంగాణ) : ఉద్యమనేత, గులాబీ దళపతి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సుయాత్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సూపర్ సక్సెస్ అయ్యింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలో పాల్గొన్న ఆయనకు గులాబీ అభిమానులు నీరాజనాలు పలికారు. దూరప్రాంతాల నుంచి జనం కొత్తగూడెం పట్టణం వచ్చి రోడ్ షోను విజయవంతం చేశారు. ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. జనసంద్రంగా మారిన రోడ్ షో ద్వారా కేసీఆర్ ఒక అంచనాకు వచ్చారు. ముఖ్య నాయకులతో మంగళవారం రాత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. కొత్తగూడెం సింగరేణి అతిథి గృహంలో రాత్రి బసచేసిన కేసీఆర్‌ను బుధవారం కలిసేందుకు జనం బారులుదీరారు. కేసీఆర్‌ను చూడాలని భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు. సింగరేణి గెస్ట్‌హౌస్ అభిమానులతో సందడిగా మారింది. ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి పాల్వంచ వరకు వాహనాలతో రహదారి అంతా బిజీగా మారింది.

### మాజీ మంత్రి వనమా ఇంటికి వెళ్లిన కేసీఆర్

కొత్తగూడెంలో బస చేసిన కేసీఆర్‌ను మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పాల్వంచలోని తన ఇంటికి ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం బస్సులో కేసీఆర్ పాల్వంచకు వెళ్లారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి వనమా కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వనమా ఇంట్లో తేనేటి విందును స్వీకరించిన కేసీఆర్ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మళ్లీ బస్సులో మహబూబాబాద్‌కు పయనమయ్యారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు మీదుగా టేకులపల్లి, ఇల్లెందు మీదుగా బస్సు యాత్ర కొనసాగింది. ఈ పర్యటనలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, సండ్ర వెంకటవీరయ్య, భద్రాచలం ఇన్‌ఛార్జి మానె రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమ నేతకు బ్రహ్మరథం



టేకులపల్లిలో కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

టేకులపల్లి, మే 1 : బొమ్మనపల్లి వద్ద ఇల్లెందు నియోజకవర్గంలోకి ప్రవేశించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. టేకులపల్లిలో మాజీ ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు కేసీఆర్‌కు హారతులు పట్టారు. బస్సుకు క్షీరాభిషేకం చేసి పూల వర్షం కురిపించారు. అలాగే ఇల్లెందు మండల నాయకులు శీలం రమేశ్, కంభంపాటి రేణుక, దాస్యం ప్రమోద్‌ల ఆధ్వర్యంలో ఇల్లెందు కరెంట్ ఆఫీస్ సెంటర్ వద్ద, పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బానోత్ హరిసింగ్‌నాయక్, లక్కినేని సురేందర్‌రావు, బోడ బాలునాయక్, రామానాయక్, కిషన్ నాయక్, అప్పారావు, బాలాజీ, శివ, భూక్యా లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మండలి నామినేషన్లు

- నేడు నోటిఫికేషన్, ఆ తర్వాత స్వీకరణ ప్రారంభం
- నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాట్లు
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ

నల్లగొండ ప్రతినిధి, మే 1 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికకు నేడు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కూడా మొదలవుతుంది. మొత్తం 12 జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులంతా నల్లగొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. దీంతో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు సెలవు దినాలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నల్లగొండ కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.
2021 మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన శాసనమండలి సభ్యత్వ పదవికి గత డిసెంబర్‌లో రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ మిగిలిన 2027 మార్చి వరకు మిగిలిన పదవీకాలం ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఈ నెల 25వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. నేటి నుంచి లాంఛనంగా నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. ఉదయం 11 గంటలకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ వెంటే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, రూరల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ పూర్తి జిల్లాలతోపాటు సిద్దిపేట జిల్లాలోని మూడు మండలాలతో విస్తరించి ఉంది. అయితే ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులంతా తమ నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోనే దాఖలు చేయాల్సి ఉంది. రిటర్నింగ్ అధికారి నల్లగొండ కలెక్టర్ హరిచందనకు నామినేషన్లు అందజేయాల్సి ఉంటుంది. దీంతో నల్లగొండ కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం 13వ తేదీ వరకు ఉపసంహరణ గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్, జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 600 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. మొత్తం 4.61 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. అయితే ఇప్పటికే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రంగంలోకి దిగగా.. బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రావచ్చని సమాచారం. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అనంతరమే మండలి ఎన్నికలపై అన్ని పార్టీలు పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

- కొత్తగూడెం గ్రౌండ్‌లలో ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా విస్తృత ప్రచారం
- భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ కోసం 120 లేఖలు రాశా..
- మళ్లీ గెలిపిస్తే కొత్తగూడేన్ని మరింత అభివృద్ధి చేస్తా..

## వాకింగ్ చేస్తూ.. ఓట్లు అభ్యర్థిస్తూ..



వాకర్స్‌తో కలిసి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా

భద్రాద్రి కొత్తగూడెం, మే 1 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు బుధవారం తెల్లవారుజామునే మార్నింగ్ వాక్‌తో ఎన్నికల ప్రచారం షురూ చేశారు. కొత్తగూడెంలోని ప్రకాశ్ స్టేడియం, ప్రగతి మైదానం, సెంట్రల్ పార్కులో వాకింగ్ చేస్తూ.. ఓట్లు అభ్యర్థించారు. మేడే సందర్భంగా కార్మిక వర్గాలను, ప్రజలను కలుసుకొని విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిసి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నేను రాజకీయాల్లోకి రాకముందే పాల్వంచ కేటీపీఎస్‌లో పని చేసిన రోజులు, ఆనాడు కార్మికులు, తోటి ఉద్యోగులతో కలిసిమెలిసి ఉన్న పరిస్థితులను ఆయన గుర్తు చేశారు. నేను మీ వాడిని.. ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే కొత్తగూడేన్ని మరింత అభివృద్ధి చేస్తానని, మూడోసారి గెలిపిస్తే జిల్లా గొంతుకను పార్లమెంట్‌లో వినిపిస్తానన్నారు. భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్ కోసం కేంద్ర ప్రభుత్వానికి 120 లేఖలు రాశానని గుర్తు చేశారు. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు ఏనాడూ పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడలేదని, కనీసం నా పోరాటానికి కూడా సహకరించలేదన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, పార్టీ రాష్ట్ర నాయకుడు మోరె భాస్కర్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు కొట్టు వెంకటేశ్వరరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సంకుబాపన అనుదీప్, పాల్వంచ పట్టణ నాయకులు రామణమూర్తి నాయుడు, రేగడి మధు, జవహర్, సింధు తపస్వి, అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.